అవిశ్వాసానికి ఇరువర్గాలు రె'ఢీ'

- అవిశ్వాసంపై ఎవరి ధీమా వారిదే..
- గతంలోనే 20 మంది సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం
- మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో అందజేత
- రాష్ట్రంలో మారిన రాజకీయంతో కార్పొరేషన్‌లో లుకలుకలు
- అవిశ్వాసం నెగ్గాలంటే మ్యాజిక్ ఫిగర్ 18
- సమరానికి సై అంటున్న ఇరువర్గాలు

జవహర్‌నగర్: రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ గందరగోళ పరిస్థితులు బీఆర్ఎస్ పార్టీకి తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. మున్సిపల్‌లో పాలకవర్గాల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మున్సిపల్ చట్టంలో ఉన్న వెసులుబాటును ఆసరా చేసుకుని అవిశ్వాస తీర్మానానికి మరోసారి కార్పొరేటర్లు ప్రతిపాదించనున్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రస్తుత పాలకవర్గాన్ని దించేందుకు సొంత పార్టీవారే ఇతరులతో కలిపి అవిశ్వాసానికి అడుగులు వేయనున్నారు. సొంత పార్టీ మేయర్‌ను దింపేందుకు సంవత్సరం క్రితమే తిరుగుబాటు చేసి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తలొగ్గి వెనకడుగు వేశారు. కానీ నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలుంది. కొత్త సంవత్సరం జనవరిలో నాలుగేళ్లు పూర్తి అవుతుంది. దీంతో అసంతృప్తులు తమ డిమాండ్లు నెరవేర్చుకునేందుకు అవిశ్వాస బాట పట్టనున్నారు. గతంలో మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం ప్రయత్నించి చివరి క్షణంలో చేజార్చుకున్న వారంతా ప్రస్తుత పరిస్థితిని అవకాశంగా మలుచుకునే యత్నం చేయనున్నారు.

అంచనాలు తారుమారు..

2020 సంవత్సరంలో నూతన పాలవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఇండి పెండెట్లు ముగ్గురు, 21 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. గత సంవత్సర క్రితం ఇండిపెండెట్లతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కేటీఆర్, మల్లారెడ్డిల చేతులమీదుగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ప్రస్తుతం పాలకవర్గంలో 26 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లే ఉన్నారు.

మారనున్న జవహర్‌నగర్ మేయర్..?


గతంలో మేయర్ కావ్యపై అవిశ్వాసం ఏర్పాటు చేసి డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌తో సమావేశమైన అసమ్మతి కార్పొరేటర్లు (ఫైల్)

ఎమ్మెల్యే మల్లారెడ్డికి తలనొప్పిగా..

గతంలో మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలిచిన మల్లారెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టి తనకు ఇష్టం వచ్చిన వారిని మేయర్, చైర్మన్ పదవులను అప్పగించడంతో చాలామంది ప్రజాప్రతినిధులు నిరుత్సాహంగా ఉన్నారు. దీంతో ఆ పార్టీలో కొనసాగుతూనే రెబల్‌గా తయారయ్యారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు స్థానిక మేయర్‌పై కన్నెర్ర చేశారు. ఇన్నాళ్లుగా లోలోన రగిలిన అసంతృప్తి నేడో రేపో బద్దలు కానుంది.

అవిశ్వాసం కోసం మ్యాజిక్ ఫిగర్ 18

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో గత సంవత్సరం 16వ డివిజన్ కార్పొరేటర్ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా 25 మంది కార్పొరేటర్లతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్లు ఉన్నారు. ఒకవేళ అవిశ్వాసం పెడితే 18 మంది సంత కాలు అవసరం అవుతాయి. కాగా ప్రస్తుత మేయర్ గట్టెక్కాలంటే ఆమెతో పాటు 9 మంది సంతకాలు చేయాల్సి ఉంది.

ఆత్మగౌరవం కోసమే అవిశ్వాసం..

రాజకీయంలో ఎలాంటి అనుభవం

బీఆర్ఎస్‌కు షాకింగ్..

సొంత పార్టీకి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లే అదే పార్టీకి చెందిన మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటూ గత 11 నెలల క్రితం కలెక్టర్‌ను వేడుకోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంసం అయ్యింది. అటు పార్టీ అధిష్టానం కానీ అప్పటి మంత్రి మల్లారెడ్డి ఈ సమస్యను ఎలా గట్టెక్కిస్తారని పలువురు ఎదురు చూడగా ఆ అవిశ్వాసాన్ని నాలుగో సంవత్సరానికి పొడిగించారు.

లేకున్నా అప్పటి మంత్రి మల్లారెడ్డి చెబితేనే మేయర్‌గా మేకల కావ్యకు మద్దతిచ్చామని అసమ్మతి కార్పొరేటర్లు అన్నారు. అప్పటి నుంచి ఆమె కేవలం తన తండ్రి మేకల అయ్యప్ప అడుగుజాడలో నడుస్తూ కార్పొరేటర్లను అడుగడుగునా అవమానపరిచారని గతంలో క్యాంపునకు వెళ్లిన కార్పొరేటర్లు ఆరోపించారు. కార్పొరేషన్‌లో కుటుంబ సభ్యుల పెత్తనం చెలాయిస్తున్నా భరించామని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే


బాపట్ల క్యాంపునకు తరలిన జవహర్‌నగర్ కార్పొరేటర్లు (ఫైల్)

మల్లారెడ్డి, మేయర్ కావ్య దృష్టికి తీసుకెళ్లినా వారి వ్యవహారశైలిలో ఎలాంటి మార్పులేదని వాపోయారు. డబ్బులతోనే రాజకీయం చేయవచ్చన్న భావనలో ఉన్న అయ్యప్ప ఇంటికి వెళ్లినా సరైన గౌరవం ఇవ్వకపోగా అవమానపరిచేవిధంగా మాట్లాడుతారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకమీద ఆత్మగౌరవం లేనిచోట ఉండబోమని కార్పొరేటర్లకు సరైన గౌరవం కల్పిస్తూ కార్పొరేషన్ అభివృద్ధికి తోడ్పడేవారికే మద్దతు ప్రకటిస్తామని గతంలోనే అసమ్మతి కార్పొరేటర్లు ప్రకటించారు.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి కార్పొరేటర్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్‌ల నేతృత్వంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో పాటు మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ సైతం పార్టీలో చేరారు. దీంతో జవహర్‌నగర్ రాజకీయం రసవత్తరంగా తయారైంది.

మేయర్ పీఠంపై ఇద్దరి గురి

మేయర్ పీఠంపై 28వ డివిజన్ కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, 18వ డివిజన్ కార్పొరేటర్ దొంతగాని శాంతికోటేష్‌గౌడ్ పోటీపడుతున్నారు. నిహారికగౌడ్ తండ్రి మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్ రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో తన కూతురు నిహారికకు మేయర్ పీఠం అప్పగిస్తే జవహర్‌నగర్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం అంటుండగా, కోటేష్‌గౌడ్ తన భార్య శాంతికే మేయర్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. కాగా వీరిద్దరిలో ఎవరికైనా మా మద్దతు ఉంటుందని అసమ్మతి కార్పొరేటర్లు గతంలో క్యాంపు రాజకీయంలో తేల్చిచెప్పారు.

పట్టించుకోని ఎమ్మెల్యే..

జవహర్‌నగర్‌లో జరుగుతున్న పరిణామాలపై మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పట్టించుకోవడం లేదు. గతంలోనె మేయర్‌పై అవిశ్వాసం పెడతామని సూచనప్రాయంగా చెప్పి అవిశ్వాసం పెట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. నిధులకు ఇబ్బంది ఏర్పడుతుందని మేయర్‌ను మారిస్తే అన్ని రకాల ప్రయోజనాలు ఉంటాయని కార్పొరేటర్ల మధ్య చర్చ జరుగుతోంది. మరో వారం, పది రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసుకుని తమ నిర్ణయాన్ని తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది. నూతన సంవత్సరంలో నూతన మేయర్ వస్తుందా..? లేక క్యాంపు రాజకీయాలతో పాత మేయర్‌ను కొనసాగిస్తారా వేచిచూడాల్సిందే.

మారిన రాజకీయ సమీకరణాలు

ప్రస్తుతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. నాలుగు సంవత్సరాలుగా బీఆర్ఎస్‌కు చెందిన మేయర్, కార్పొరేటర్లు ఉన్నా కార్పొరేషన్‌లో కోల్డ్‌వార్ నడిచింది. గతంలో మేయర్ పదవి ఆశించి భంగపడ్డ మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ కూతురు 28వ డివిజన్ కార్పొరేటర్ నిహారికగౌడ్ ప్రస్తుతం కాంగ్రెస్‌లోకి వెళ్లి మేయర్ పీఠంపై



గురిపెట్టింది. గతంలో డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, 18వ డివిజన్ కార్పొరేటర్ దొంతగాని శాంతికోటేష్‌గౌడ్ అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందించి క్యాంపు రాజకీయం చేసి అసమ్మతి గళానికి ఊతం పోశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయ్యింది. జవహర్‌నగర్ అభివృద్ధికి నిధులు రావాలంటే అధికార కాంగ్రెస్ మద్దతు తప్పనిసరైంది. దీంతో ఈ సంవత్సరం నిహారికగౌడ్‌కు ఒక ఛాన్స్ ఇవ్వాలని పట్టుపడుతున్నారు.

28 నుంచి ప్రజాపాలన సభలు


త్రిలేశ్వర్‌రావు

మేడ్చల్: ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలనలో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో సభలు నిర్వహించేందుకు 23 కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు అన్ని వార్డుల్లో కౌన్సిలర్ల అధ్యక్షతన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు



మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో అయ్యప్ప స్వామి పల్లకిసేవ, ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప స్వాములు మణికంఠుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చడం సరికాదు

ఘట్‌కేసర్: పేదల ఇళ్లను కూల్చడం దారుణమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాచవాని సింగారం గ్రామంలో నిరుపేదల ఇళ్లను ఈ నెల 22న కూల్చివేతలను తీవ్రంగా ఖండించారు. సర్వే నెంబర్ 66లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు అక్రమంగా కబ్జాలకు పాల్పడి, అక్రమ నిర్మాణాలు చేపట్టగా నాయకుల అక్రమ నిర్మాణాలను కూల్చే ధైర్యం లేని అధికారులు నిరుపేదల ఇళ్లను కూల్చడం ఎంతవరకు సమంజసం అన్నారు. పార్టీల నాయకుల కబ్జాలను పూర్తిగా తొలగించి కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శివరాజ్‌గౌడ్, శంకర్, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


పడిపూజ నిర్వహిస్తున్న కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్

పోచారం: అన్నోజిగూడలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మహా పడిపూజ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలో గ్రామ సర్పంచ్, నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం పునర్నిర్మాణ పూజలు మంగళవారం నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఎంపీటీసీ రఘు, ఉపసర్పంచ్ వెంకటేశ్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, నాయకులు మల్లారెడ్డి, నానిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, పోచయ్య, క్రిష్ణ, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు


గంజాయి విక్రేతలతో పోలీసులు

జవహర్‌నగర్: గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొమ్ము విజయ్(27), గిడ్ల పవన్‌కుమార్(42), కుంచం ప్రశాంత్(23), అరుణ్‌కుమార్ (30)లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, రెండు చిన్న సీసాలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా నేరమని, అలాంటి వారిని వదిలిపెట్టమని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శామీర్‌పేట్: రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మరణించాడు. వివరాలు.. జవహర్‌నగర్‌లో నివాసం ఉండే కృష్ణచారి ఈ నెల 23న ఉదయం స్కూటీపై శామీర్‌పేట మండలం లాల్‌గడి మలకపేటకు వస్తుండగా అలియాబాద్ గ్రామ సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో కృష్ణచారి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృత్యువాత పడినట్లు వైద్యులు నిర్ధారించారని, ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

శామీర్‌పేట్: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ పోతాయిపల్లికి చెందిన దయ్యాల అశోక్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మాదిరిగానే ఈ నెల 24న రాత్రి మద్యం సేవించి, మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కాగా 26న ఉదయం ఆరోగ్యం సహకరించడం లేదంటూ తన భార్యకు తెలపగా వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనతో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 28 నుంచి ప్రతి వార్డుల్లో నిర్వహించే ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయా వార్డుల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఘట్‌కేసర్: సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని కాచవానిసింగారం, ఏదులాబాద్, రాజీవ్ గృహకల్పలో సీపీఐ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించి వార్షికోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సు ఘట్‌కేసర్ మండల కార్యదర్శి ఈశ్వర్, ఏఐటీయూసి రాష్ట్ర నాయకులు సవిత పాల్గొని ప్రసంగించారు. నాయకులు సోమన్న, అన్వర్‌పాషా, చౌదరి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

మేడ్చల్‌రూరల్: దత్త జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘనాపూర్ గ్రామ పరిధిలోని మల్లిఖార్జున స్వామి గుట్టపై దత్తాత్రేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ జనార్ధన్‌రావు, ప్రభావతి దంపతులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్, కో ఆప్షన్ సభ్యులు జీవన్‌రావు భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూడూర్ గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, అర్చకులు వెంకటేశ్‌శర్మ, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్, క్రిష్ణ, మహేశ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లిలో వికసిత భారత్ సంకల్పయాత్ర


అంకిరెడ్డిపల్లిలో వికసిత్ భారత సంకల్పయాత్రలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

కీసర: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసే ప్రధాన లక్ష్యంతో వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం అంకిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు అందజేసేందుకు గ్రామాల వారిగా వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బెస్త వెంకటేష్, సర్పంచ్ మోర విమలనాగరాజు, ఎంపీఓ వినూత్నరెడ్డి, పంచాయతీ సభ్యులు, డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించి టీషర్టులు పంపిణీ చేశారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కేసులు ఉంటే వాహనదారులు మేడ్చల్ న్యాయస్థానంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ కోరారు. డ్రంకన్ డ్రైవింగ్, లైసెన్సు లేని డ్రైవింగ్ వంటి కేసులు తక్కువ జరిమానాతో పరిష్కారం అవుతాయని తెలిపారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి


శివసాయినగర్ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శివసాయినగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం హబ్సిగూడలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 31వ తేదీన శివసాయినగర్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి హాజరుకావాలని కాలనీ కార్యవర్గ సభ్యులు ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి, కొండగళ్ల అశోక్, బర్ల రామచంద్రారెడ్డి, నారా నర్సింహులు, కాసుల సురేష్‌గౌడ్, జూపల్లి అశోక్, సత్యనారాయణరెడ్డి, రమేష్‌రావు, నర్సింహచారి ఉన్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో లలితకు పీహెచ్‌డీ



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని సుద్దపల్లి లలితకు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టా లభించింది. ఘట్‌కేసర్ మండలం నారపల్లికి చెందిన ఆమె ప్రొఫెసర్ వి.సుధ ఆధ్వర్యంలో 'భారతీయ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రభావంలో ట్రెండ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రకటించింది. భారతదేశ ఔషధ పరిశ్రమ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రంగా ఉంది. ఈ పరిశోధన ఫలితంగా భారతీయ ఫార్మాస్యూటికల్ రంగంపై ఎఫ్‌డీఐ విధానాల సరళీకరణ, పరిశ్రమ ఆర్థిక పనితీరుపై ఎఫ్‌డీఐల ప్రభావాలను విస్తృతంగా అర్థం చేసుకోవచ్చు. పరిశోధనకు సహకరించిన రీసెర్చ్ సూపర్‌వైజర్, ఇతర ఉపాధ్యాయులకు లలిత కృతజ్ఞతలు తెలిపారు.

ఆధునిక పద్ధతిలో విద్యాబోధన జరగాలి

కొత్త కిశోర్‌గౌడ్



బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో విద్యాబోధన జరగాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల 22వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. నేటి యువతీ యువకులు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాణిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు నిధులు కేటాయిస్తూ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్, జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, పాఠశాల ఇన్‌చార్జి విజయ్‌కుమారి, నేతలు బందారం నాగేశ్వర్‌గౌడ్, మీసాల యాదగిరి, రాపోలు రామస్వామి, బి.నందప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై అధికారులతో సమావేశం

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి వార్డు సభలు నిర్వహించేందుకు మంగళవారం బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు బోడుప్పల్‌లోని 28 డివిజన్లకుగాను 33 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి కేంద్రానికి ఒక అధికారి, అవసరం మేరకు 4 నుంచి 8 మంది సిబ్బంది కేటాయిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసి ఆదేశాలు, సూచనలు జారీ చేయడం జరిగింది. ఈ నెల 28వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం నిర్వహణపై బుధవారం బోడుప్పల్ పాలకవర్గ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలపై చర్చిస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీపీఐ పోరాటం


జవహర్‌నగర్ సీపీఐ కాలనీలో జెండాను ఎగురవేస్తున్న తోటపల్లి శంకర్

జవహర్‌నగర్: దేశంలోని కార్మికులు, శ్రామికులు, బడుగు, బలహీన వర్గాల కోసం, రైతులు, వ్యవసాయ కూలీలు, యువతీయువకులు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం సీపీఐ ఎన్నో పోరాటాలు చేసి వారి హక్కులను సాధించిందని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ అన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బాలాజీ నగర్ సీపీఐ కాలనీలో ఎర్ర జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన నిరంతరం పోరాడేది సీపీఐ పార్టీ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దర్శనం యాదగిరి, రాజేశ్వరి, స్వరూపనాయక్, ఎల్లన్న, లక్ష్మణ్, మల్లిక, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. టీచర్స్ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి తోడ్పాటు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆలేటి మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బంగారం రాములుచారి, నర్సింగరావు, నాయిని శేఖర్‌రెడ్డి, నరసింహ, ప్రసాద్, కృష్ణానాయక్, రాథోడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.